

మైనారిటీ ఆస్తులపై పెద్దల కన్ను..?

మదనపల్లె పట్టణంలోని విలువైన మైనారిటీ ఆస్తులపై అధికార పార్టీ పెద్దల కన్ను పడిందా..? విలువైన ఆస్తులను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారనే చర్చ మొదలైంది. - 8లో



వెలుగు దివ్వెలు..!

వైకల్యం శరీరానికే తప్ప మనస్సుకు కాదని ఆ చిన్నారులు నిరూపిస్తున్నారు. సాధారణ వ్యక్తులకు తాము ఏ మాత్రం తీసిపోమని అంటున్నారు ప్రత్యేక ప్రతిభావంతులు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.520	రూ.600
రెండోరకం	రూ.380	రూ.500

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 52 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

– మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో రాబోయే రెండు, మూడేళ్లలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. భూములు కోల్పోయిన బాధితులకు ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా న్యాయం చేస్తామన్నారు. ఎంపీడీఓ రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

13న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

రాయచోటి అర్బన్ : ఆర్టీసిలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 13న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఏపీఆర్టీసీ కర్నూలు జోనల్‌సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ నజీర్ అహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 5 నుంచి 19వ తేదివరకు అప్రెంటిస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న డీజల్, మోటర్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్) అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కర్నూల్లోని ఏపీఎస్ఆర్టీసీ జోనల్‌సిబ్బంది శిక్షణ కళాశాలకు హాజరుకావాలన్నారు. 13వ తేది మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



పసుపు పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం సాలాబాద్ గ్రామ పరిధిలోని ఉద్యాన పంటలను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల ప్రభావం పంటలపై ఎలా ఉందనే విషయంపై జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులతో కలిసి కలెక్టర్ పసుపు, సంపెంగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, మండల వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

– ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, చిత్రంలో ట్రైనీ ఎస్పీ

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయకూడదని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వాటి పరిష్కారంపై ఎస్పీ స్పందించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులకు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు తదితర సమస్యలపై ఫిర్యాదుదారులు ఎస్పీకి విన్నవించుకున్నారు. బాధితులకు చట్టపరిధిలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.

ఎస్పీని కలిసిన ట్రైనీ ఐపీఎస్ మహేష్

జిల్లా ఎస్పీని ట్రైనీ ఐపీఎస్ అధికారి బుద్దా మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

5న టేబుల్ టెన్నిస్ పోటీలు

వైవీయూ : యోగి వేమన విద్యాలయం అంతర కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలు ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు వైవీయూ క్రీడా బోర్డ్ కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2024 సంవత్సరం జూలై 7వ తేదీ నాటికి 17 సంవత్సరాలు నిండి 25 సంవత్సరాలలోపు ఉండాలన్నారు.

వాన.. హైరానా!

వదలని వర్షం!

- రైల్వేకోడూరు నియోజకవర్గంలో తీవ్ర ప్రభావం
- ఓబులవారిపల్లె–బాలిరెడ్డిగారిపల్లె మధ్య స్తంభించిన రాకపోకలు
- రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె, తంబళ్లపల్లెలో పంటలకు తీవ్రనష్టం
- పరవళ్లు తొక్కుతున్న పుల్లంగేరు, గంజనేరు, ముష్టేరు
- చెయ్యేరుకు, పింఛాకు పెరుగుతున్న వరద నీరు
- వర్షాలతో స్తంభించిన జన జీవనం



రైల్వేకోడూరు అర్బన్ : పారుతున్న శెట్టిగుంట చెరువు అలుగు



పుల్లంపేట ప్రాంతంలో ప్రవహిస్తున్న వాగు

సాక్షి రాయచోటి : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఏర్పడిన ఫెంగల్ తుపాను జిల్లాను వణికిస్తోంది. రెండు, మూడురోజులుగా జడిపట్టి కురుస్తున్న వర్షాలతో జిల్లా తడిసి ముద్దయింది. ముఖ్యంగా రైల్వేకోడూరుతోపాటు రాజంపేట, మదనపల్లె, తంబళ్లపల్లెల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంది. మరోవైపు తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల ధాటికి చలి ప్రభావం అధికమైంది. సోమవారం జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. వర్షాలకు జన జీవనం కూడా స్తంభించింది. ఇక సాగులో ఉన్న మామిడి, బొప్పాయి, అరటి, మొక్కజొన్న తోటల్లో నీరు నిలవగా.., కోత దశలో ఉన్న వరి పంట పూర్తిగా నేల వాలింది. ప్రధాన నది చెయ్యేరు వరద నీటి ప్రభావంతో కనిపిస్తుండగా, రైల్వేకోడూరులో గుంజనేరు, ముష్టేరు, పుల్లంగేరులు పోటెత్తాయి.

స్తంభించిన రాకపోకలు

ఓబులవారిపల్లె–బాలిరెడ్డిపల్లె వయా కోట రోడ్డులో వంక ప్రవాహం పోటెత్తడంతో రాకపోకలు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. అధికారులు కూడా అక్కడే ఉండి వాహనాలు, ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మరోవైపు మండల కేంద్రమైన పుల్లంపేట నుంచి సీతారాజంపేటకు వెళ్లే రహదారి రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొంతమేర దెబ్బతింది. దీంతో ఈ రహదారి గుండా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ప్రజలు బైపాస్ మీదుగా రాకపోకలు కొనసాగించాల్సి వచ్చింది. కోడూరు పరిధిలోని ముష్టేరు, గుంజనేరు కూడా నీటితో ఉరకలెత్తుతున్నాయి. కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని మామండూరు సమీపంలో శేషాచలం అడవుల నుంచి వరద నీరు రోడ్డుపైకి వస్తోంది.

వేలాది ఎకరాల్లో పంట నష్టం

అన్నమయ్య జిల్లాలో తుఫాను వర్షం బీభత్సం సృష్టిస్తోంది. రైల్వేకోడూరు పరిధిలో ముగ్గురు రైతులకు చెందిన అరటి తోటలు దెబ్బతినగా రోడ్డు వెంబడి ఎక్కడ చూసినా మామిడితోటల్లో నీరు కనిపిస్తోంది. రాజంపేట పరిధిలో అరటి, మొక్కజొన్న, మామిడి, బొప్పాయి తోటల్లో నీరు చేరడంతో పంటనష్టం వాటిల్లుతోంది. బి. కొత్తకోట మండలంలో 330 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఆదివారం వరకు చేసిన సర్వే ప్రకారం వరి 300 ఎకరాల్లో, మొక్కజొన్న 30 ఎకరాల్లో పంటలు నష్టపోయాయని.. పంట నష్టాలపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపామని ఏఓ చంద్రశేఖర్ తెలిపారు.

చెయ్యేరు, పింఛాలకు వరద నీరు

ఎగువ ప్రాంతాలతోపాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు చెయ్యేరు వరద నీటితో కనిపిస్తోంది. పింఛా ప్రాజెక్టుకు 1072 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు కెపాసిటి 0.26005 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 996.500 అడుగుల వరకు నీరు చేరింది. ప్రస్తుతం పింఛా ప్రాజెక్టులో నీరు కెపాసిటీకి దగ్గరగా 79.38 శాతంకు చేరుకుంది.



రైల్వేకోడూరు అర్బన్ : తెగి పోయిన రామయ్యపాలెం దారి



బి.కొత్తకోట : బడికాయలపల్లెలో దెబ్బతిన్న వరిపంట



రైల్వేకోడూరు : బాలపల్లి వద్ద జాతీయ రహదారిలో జలసోయగం

జడివాన



వైకోట చెరువు నిండటంతో అలుగుపారుతున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండలంలోని గుండాలేరు, పాములేరు ఉధృతంగా సాగుతున్నాయి. వైకోట చెరువు నుంచి అలుగు పారుతోంది. రెడ్డికాలువ సాగడంతో కొర్లకుంట చెరువులోకి భారీగా నీరు చేరుతోంది. ఆదివారం ఉదయం నుండి సోమవారం సాయంత్రం వరకు 98.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారి తెలిపారు.

ఇప్పుడే కోత వద్దు



తడిచిన పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రాయచోటి టౌన్ : వర్షాలు ఆగే వరకు వరి కోతను వాయిదా వేసుకోవాలని రైతులను జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ సూచించారు. సోమవారం వరిగ గ్రామంలోని వరి పొలాలను పరిశీలించారు. కోతకు వచ్చిన పోలాలను చూసిన తరువాత ఆయన రైతులతో మాట్లాడారు. తుపాన్ కారణంతో వరి పంట దెబ్బతినే అవకాశం ఉందని, మొలకెత్తే అవకాశం కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీలత, రాయచోటి వ్యవసాయశాఖ అధికారి దివాకర్, బివిమోహన్, ఇతరా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్ : జిల్లా ఐసీడీఎస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ,సాధికారత అధికారిణి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె బాలసదనాలకు మంజూరైన పోస్టులకు కాంట్రాక్టు, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో ఒక ఆఫీస్ ఇన్‌చార్జ్ పోస్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ముగ్గురు వంట మనుషులు, ఒక హెల్పర్, రెండు హౌస్‌కీపింగ్ పోస్టులు, రెండు ఎడ్యుకేటర్, రెండు ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్‌లు, మూడు ఇన్‌స్ట్రక్టర్లు, యోగా టీచర్ పోస్టులు, ముగ్గురు హెల్పర్ లేదా నైట్‌వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పోస్టుల దరఖాస్తుకు అర్హత, నిర్ణయ ప్రమాణాలు, దరఖాస్తు ఫారంలను httpr://annamayya.ap.gov.in వెబ్‌సైట్‌నుంచి పొందాలని సూచించారు. అన్ని అర్హతలున్న మహిళా అభ్యర్థులు మాత్రమే పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను సంబంధిత ధ్రువపత్రాలను జతపరిచి 13వతేది సాయంత్రం 5గంటల లోపు సుండుపల్లె మార్గంలో కేటీసీ ఫంక్షన్ హాలు ఎదురుగా గల ఐసీడీయస్ పీడీ కార్యాలయంలో అందచేయాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

స్కౌట్‌తో క్రమశిక్షణ.. సేవాభావం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ పెంపొందడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం అన్నారు. రాయచోటి పట్టణంలోని ఓ కళాశాలలో సోమవారం నుంచి స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు బేసిక్‌తో పాటు అడ్వాన్స్‌లో ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ మాస్టర్లు, కెప్టెన్లు అందరూ సేవాభావం కలిగి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చన విద్యాసంస్థల కరెస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, ట్రెజరర్ ఓబుల్‌రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

అదే వివక్ష

- నాటి నుంచి చంద్రబాబు హయాంలో జిల్లాకు ఒరిగింది శూన్యం
- మొన్న మెడికల్ కళాశాలకు మంగళం ...నిన్న ఎంఎస్ఎంఈ తరలింపు
- తాజాగా ఏపీజీబీ హెడ్ ఆఫీసుకు ఎసరు
- కడప నుంచి తరలివెళుతున్న పబ్లిక్ సెక్టార్

సాక్షి ప్రతినిధి, కడప : కడప అంటే ఆది నుంచి వివక్షే. రాష్ట్ర ప్రజలందరికీ పాలకుడైనా, ఇక్కడి ప్రజల పట్ల చీత్కారం తెరపైకి వస్తూనే ఉంది. మునుపంతా ఓట్లు–సీట్లు ఇవ్వలేదు, మీకేందుకు పనులు చేయాలంటూ సీఎంహోదాలో బాహాటంగా వ్యాఖ్యానించిన చంద్రబాబునాయుడు తాజాగా ఓట్లు–సీట్లు ఇచ్చినా అదే వివక్ష చూపుతున్నారు. క్రమం తప్పకుండా పబ్లిక్ సెక్టార్‌కు మంగళం పలుకుతున్నారు. కడప అంటే కడుపు మంట ప్రదర్శిస్తున్నారు.

చంద్రబాబు నాయకత్వంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందుల మెడికల్ కళాశాలకు మోకాలొడ్డారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మంజూరు చేసిన 50 ఎంబీబీఎస్ సీట్లు తిరస్కరించారు. రూ.530 కోట్లతో వైఎస్సార్‌సీపీ సర్కార్ మెడికల్ కళాశాలను నెలకొలిపితే, అవకాశాన్ని సద్వినియోగ పర్చకుండా తిరస్కరిస్తూ చంద్రబాబు సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత భారత ప్రభుత్వం కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు మంజూరు చేసిన రెండో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని సైతం అమరావతికి తరలించారు. వెనుకబడిన జిల్లాను సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈ అభివృద్ధి చెందిన ప్రాంతానికి తరలించుకుపోయారు.

నాడు ఉర్దూ యూనివర్సిటీకి మంగళం

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎప్పుడు బాధ్యతలు చేపట్టినా జిల్లాను అన్యాయానికి గురి చేస్తున్నారు. అందుకు ఆయన చర్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. 2014–19హయాంలో కడపకు మంజూరైన ఉర్దూ యూనివర్సిటీని కర్నూలుకు తరలించారు. అప్పట్లో ఇక్కడ కాకపోయినా రాయలసీమలోనే కొనసాగించారని సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈమారు ఎంఎస్ఎంఈ సంస్థను తరలించారు. రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు భారత ప్రభుత్వం మంజూరు చేసింది. కొప్పర్తిలోని నార్త్ బ్లాక్‌లో 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఉచిత లీజు ప్రాతిపదికన ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. అమలు చేయాల్సిన చంద్రబాబు సర్కార్ జిల్లాకు మొండిచేయి చూపుతూ అమరావతికి తరలించారు.

బాధ్యతను గుర్తించని ప్రజాప్రతినిధులు...

క్రమం తప్పకుండా జిల్లా నుంచి పబ్లిక్ సెక్టార్ తరలిస్తుంటే ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధులు బాధ్యతను గుర్తించలేకపోతున్నారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోయినా కనీసం ఉన్న సంస్థలనైనా కాపాడుకోవాల్సిన అవసరం లేదా అని పలువురు నిలదీస్తున్నారు. ఇవేమి పట్టించుకునే స్థితిలో కూటమి సర్కార్ ప్రజాప్రతినిధులు లేరని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆదాయ మార్గాలపై ఉన్న శ్రద్ధ ఈ ప్రాంతపైనా.. ప్రజలపైనా చూపించలేకపోతున్నారనే విమర్శలను మూటగట్టుకున్నారు. ఈక్రమంలో పౌరసమాజం మరీ ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాలు పోరాటం దిశగా నడుం బిగిస్తున్నారు. మంగళవారం దుర్గమ్మ దేవస్థానం ఎదురుగా ఉన్న డాక్టర్ ముఖర్జీ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మరీ ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రాంతం కోసం ప్రజల కోసం ఇప్పటికైనా కళ్లు తెరవాలని పలువురు కోరుతున్నారు.



కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయం

ఏపీజీబీ హెడ్ ఆఫీసుకు ఎగనామం పెట్టేందుకు రంగం సిద్ధం

తాజాగా కడప కేంద్రంగా పని చేస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) హెడ్ ఆఫీసు తరలింపునకు రంగం సిద్ధం చేశారు. గ్రామీణ బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ పేరుతో అమరావతికి తరలించనున్నారనే వార్తలు కడప జిల్లాలోనే కాదు, రాయలసీమ వ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. వాస్తవంగా కడప కేంద్రంగా పని చేస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు బిజినెస్ పరంగా, లాభాలపరంగా మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ మొదటి నిబంధన పెద్ద బ్యాంకు హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగించవచ్చని తెలిపినప్పటికి చంద్రబాబు సర్కార్ జిల్లాకు ఎగనామం పెట్టేందుకు సన్నమైందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అమరావతికి తరలింపు వార్త వెనకబడిన రాయలసీమపై, అందులో కడప పట్ల వివక్ష చూపడమే అవుతుందని వారు భావిస్తున్నారు.

సాయుధ దళాల సేవలను గౌరవిద్దాం

కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: సాయుధ దళాల త్యాగాలు, సేవలను గుర్తించి జెండా దినోత్సవాన్ని గౌరవించడం మనందరికి దక్కిన ప్రత్యేకమైన అవకాశమని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సాయుధ దళాల జెండా దినోత్సవం (డిసెంబర్ 7) సందర్భంగా ప్రత్యేక కార్ ఫ్లాగ్‌లు, స్టిక్కర్లను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, వైఎస్సార్ కడప జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి ఎం.డి రజాక్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాజీ సైనికులు, వీరనారులు కుటుంబాల సంక్షేమానికి మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



కార్ ఫ్లాగ్‌లు, స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

పోస్టర్ల ఆవిష్కరణ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుపరుస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా పంటను బీమా చేయించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నమయ్య జిల్లాలోని రైతులకు సూచించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రబీ 2024–25 సీజన్‌కు గాను కేంద్ర వ్యవసాయ మరియు రైతుల సంక్షేమ శాఖ, ఐసీఏసీఐ సంయుక్తంగా రైతులకు అందిస్తూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుపరుస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

ములకలచెరువు : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒక జింక మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. బుర్రకాయల కోట అటవీ శాఖ సెక్షన్ అధికారి షబీన్ కథనం మేరకు.. స్థానిక మండల కేంద్రంలోని కదిరి రోడ్డులో రోడ్డు దాటుతున్న జింకను గుర్తు గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జింక సంఘటన స్థలంలోని మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు జింకను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించి కనుకొండ అడవిలో ఖననం చేశారు.

మహిళ అదృశ్యం


మంజుల (ఫైల్)

మదనపల్లె : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన నరసింహులు కుమార్తె ఎస్.మంజుల(49) నవంబర్ 29 సాయంత్రం ఇంటి వద్ద నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో మంజుల తమ్ముడు ప్రశాంత్‌కుమార్ ఈనెల 1న తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య


రమణయ్య మృతదేహం

తంబళ్లపల్లె : కుటుంబ సభ్యులు మందలించారని మనస్థాపంతో ఆటో డ్రైవర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో జరిగింది. కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు.. రేణుమాకులపల్లె పంచాయతీ మిట్టమాలపల్లెకు చెందిన రమణయ్య(49) ఆటో నడుపుకుంటూ కుటుంబ పోషణ సాగించేవాడు. ఈ మధ్యకాలంలో దుర్వ్యసనాలకు లోనై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన రమణయ్య గ్రామానికి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్.ఐ లోకేష్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చెట్టును ఢీ కొన్న లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

పుల్లంపేట : కడప-చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లి డాబా వద్ద రోడ్డుపై పెద్దగుంత ఉండటంతో లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొంది. వివరాలిలా.. ఏపీ21టిఎక్స్0727 నంబరుగల లారీ గోతాలతో ఆళ్లగడ్డకు వెళ్తుండగా రోడ్డుపై గుంత ఉండటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో ప్రమాదానికి కారణమైన గుంతను పూడ్చి వేయించారు.

మైనారిటీ ఆస్తులపై పెద్దల కన్ను..?

- వక్ఫ్‌బోర్డు పేరుతో స్వాధీనానికి యత్నం
- కోర్టును ఆశ్రయించిన ట్రస్ట్ సభ్యులు
- ఆస్తుల స్వాధీనానికి దూకుడుగా వ్యవహరించిన వక్ఫ్‌బోర్డు
- నాలుగు వారాల పాటు స్టే విధించిన హైకోర్టు


బెంగళూరు బస్టాండ్ సమీపంలోని అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్‌కు చెందిన ఆస్తులు


నవంబర్ 23న ట్రస్ట్ ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్న వక్ఫ్‌బోర్డు అధికారులు (ఫైల్)

మదనపల్లె : పట్టణంలోని విలువైన మైనారిటీ ఆస్తులపై అధికార పార్టీ పెద్దల కన్ను పడిందా..? అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్‌కు చెందిన కోట్ల విలువైన ఆస్తులను, అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారా..? ఇన్నాళ్లు ఆస్తుల స్వాధీనానికి చొరవ చూపని వక్ఫ్‌బోర్డు, ఉన్నపళంగా ట్రస్ట్‌కు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా ఒకే రోజులో స్వాధీనం చేసుకున్నామని ప్రకటించడం వెనుక మతలబేంటి..? దీనివెనుక ఉన్న అదృశ్యశక్తులు ఎవరంటూ పట్టణంలో చర్చ మొదలైంది.

పట్టణంలోని బెంగళూరు బస్టాండు సమీపంలో జామియా మసీదుకు ఆనుకుని అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్‌కు చెందిన సుమారు రూ.10 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. వీటి పూర్వాపరాలను పరిశీలిస్తే.. ముస్లిం కమ్యూనిటీలో ప్రముఖుడైన సికిందర్‌సాబ్ అనే వ్యక్తికి చెందిన ఆస్తి అని, తర్వాత అతడి కుమారుడు దస్తగిరి, అతని కుమారుడు మగ్బూల్‌కు వారసత్వంగా సంక్రమించింది. గతంలో శానిటోరియంకు క్షయవ్యాధి నివారణ కోసం వచ్చిన ముస్లిం మైనారిటీలకు వసతి సదుపాయాల కోసం వినియోగించేవారు. దీన్ని అప్పట్లో ముస్లిం పెద్దలు మసీదు కమిటీకి ఇవ్వాల్సిందిగా కోరారు. అయితే మగ్బూల్ సాహెబ్ కుమారుడు డాక్టర్ నూర్ అహ్మద్ 2000 సంవత్సరంలో అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ- ఇస్లాం పేరుతో ట్రస్ట్‌ను స్థాపించి, పట్టణానికి చెందిన వై.రహంతుల్లాను అధ్యక్షుడిగా, టమాటా బషీర్‌ను వైస్ ప్రెసిడెంట్‌గా, జనరల్ సెక్రటరీగా అడ్వకేట్ కమాలుల్లాబాషా, ట్రెజరర్‌గా ఐనుల్లాతో పాటుగా మొత్తం 36 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. తనవంతుగా రూ.లక్ష విరాళం ప్రకటించి, సేవాకార్యక్రమాలు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో ట్రస్ట్ సభ్యులు ఆ స్థలంలో కింద 11 షాప్‌రూమ్‌లు నిర్మించి అద్దెకు ఇచ్చారు. పైభాగంలో మదనపల్లెకు వివిధ అవసరాలపై వచ్చే ముసాఫిర్‌లు (యాత్రికులకు) విడిదిసత్రంగా ఏర్పాటు చేశారు. షాప్‌రూమ్‌ల ద్వారా వచ్చే ఆదాయంతో ముస్లిం వితంతువులకు, పేద కుటుంబాలకు, పెళ్లిళ్లకు ఆర్థికసహాయం, ఉచిత ఖత్నా, హజ్‌యాత్రికులకు వ్యాక్సినేషన్ తదితర సేవా కార్యక్రమాలు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే వీటిపై కన్నేసిన అధికారపార్టీ పెద్దలు.. ట్రస్ట్ కార్యకలాపాలు కొనసాగడం లేదని, ఆస్తులు వక్ఫ్‌బోర్డు స్వాధీనం చేసుకోవాలంటూ కోరారు. కోరిందే తడవుగా వక్ఫ్‌బోర్డు ఆస్తుల స్వాధీనానికి ఆదేశాలు జారీచేసింది. అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ వసీమ్ అక్రమ్, నవంబర్ 23వ తేదీన మదనపల్లెకు హడావిడిగా వచ్చి ట్రస్ట్ సభ్యులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు అందజేయకుండా అధికారపార్టీ పెద్దల ఆదేశాల మేరకు పంచనామా నిర్వహించారు. 1962 గెజిట్ ప్రకారం ట్రస్ట్ ఆస్తులను వక్ఫ్ ఆస్తులుగా గుర్తిస్తూ స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆస్తుల స్వాధీన ప్రక్రియ, చడీచప్పుడు లేకుండా గుట్టుగా సాగించారు. దీంతో అప్రమత్తమైన ట్రస్ట్‌సభ్యులు షేక్ ఐనుల్లా, ప్రైవేట్ ట్రస్ట్‌కు చెందిన ఆస్తులను, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వక్ఫ్‌బోర్డు ఎలా స్వాధీనం చేసుకుంటుందని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు దీనిపై తదుపరి చర్యలు నిలుపుదలచేయాలని నాలుగు వారాలు స్టే విధిస్తూ కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా వక్ఫ్‌బోర్డు, ప్రభుత్వాన్ని కోరింది. అధికారపార్టీ పెద్దలు.. అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్ ఆస్తులతో పాటుగా, ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోని నెహ్రూవీధి తాటిమానుదర్గా, చిత్తూరు బస్టాండ్‌లోని దర్గాను వక్ఫ్‌బోర్డు ఆస్తులుగా పేర్కొంటూ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే వర్గానికి చెందిన ప్రైవేట్ ఆస్తులను వక్ఫ్‌పరం చేయడంలో ఆంతర్యమేంటోనని చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఆయా ఆస్తుల్లో వారు కోర్టును ఆశ్రయిస్తే.. కౌంటర్ దాఖలు చేయాలన్న ఆదేశాలను వక్ఫ్‌బోర్డు అధికారులు స్పందించకపోవడం విడ్డూరం. దీనిపై అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. 1962 గెజిట్ నోటిఫికేషన్ పేరుతో అంజుమన్-ఏ-షరాయి అంటూ తప్పుడు పత్రాలను సృష్టించి కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ వసీమ్‌అక్రమ్ మాట్లాడుతూ.. నోటీసులు ఇవ్వకుండా ఆస్తులు స్వాధీనం చేసుకోవడం తప్ప తామెలాంటి పొరపాటు చేయలేదని, అంజుమన్-ఏ-హమ్‌దర్ద్-ఏ-ఇస్లాం ఆస్తులు వక్ఫ్‌బోర్డువేనని చెప్పుకొచ్చారు.

కూటమి డ్రామాలు ప్రజలు నమ్మరు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు డ్రామాలు ఆడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిందలు వేరొకరి మీద నెట్టేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మీద నెపం నెట్టేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో రోజుకొక సంఘటన జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత కేవలం ప్రెస్‌మీట్లు, సమీక్షలకే పరిమితమవుతున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరల పెంపుపై ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

అయ్యప్ప లడ్డూ రూ.1.20 లక్షలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీ మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి మండల పూజ కార్యక్రమంలో భాగంగా స్వామి వారి వద్ద ఉంచిన లడ్డూకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో గిరి హోటల్ యజమాని వెంకటరామిరెడ్డి రూ.1.20 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అయ్యప్ప భక్తమండలి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిల చేతుల మీదుగా ఈ లడ్డూను అందుకున్నారు.

తండ్రి చేతిలో తనయుడి హతం


హుస్సేన్ బాషా (ఫైల్)


మృతి చెందిన హుస్సేన్ బాషా

దువ్వూరు : దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో సోమవారం తండ్రి చేతిలో కొడుకు హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి విచారించారు. దువ్వూరు పోలీస్ స్టేషన్‌లో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. మహబూబ్ షరీఫ్‌కు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేయగా, కొడుకు తల్లిదండ్రుల వద్దే ఉన్నాడు. తండ్రి కొలిమి పని చేస్తుండగా, భార్య, కుమారుడు హుస్సేన్ బాషా (23) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. హుస్సేన్ బాషాకు దువ్వూరుకు చెందిన మెహబూబీతో ఆరేళ్ల కిత్రం ప్రేమ వివాహం జరిగింది. వీరికి రెండున్నరేళ్ల కుమార్తె షాహీన్, ఒకటిన్నర సంవత్సరాల కుమారుడు షాహిద్ ఉన్నారు. హుస్సేన్ బాషా మద్యానికి బానిసై తల్లిదండ్రులను, భార్యను డబ్బుల కోసం వేధిస్తుండేవాడు. కొద్ది రోజుల క్రితం మద్యానికి డబ్బు ఇవ్వలేదని తండ్రిని కట్టెతో కొట్టి బెదిరించాడు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హుస్సేన్ బాషా మద్యం తాగి ఇంటికి వచ్చి తండ్రి మహబూబ్ షరీఫ్‌ను వేధించాడు. డబ్బు లేదని తండ్రి చెప్పడంతో డబ్బు ఇవ్వకుంటే చంపుతానని కొడుకు బెదిరించాడు. భయపడిన మహబూబ్ షరీఫ్ రోకలి బండతో కొడుకు తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని చాగలమర్రి కేరళ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ తెలిపారు. హుస్సేన్ బాషా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా ఆటో బోల్తా

- ఒకరి మృతి
- 8 మందికి స్వల్ప గాయాలు


ఆటో ప్రమాదంలో మృతి చెందిన వెంకట భార్గవి

జమ్మలమడుగు రూరల్ : గండి క్షేత్రానికి దైవ దర్శనానికి వెళ్తుండగా ఆటో బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ కల్పన కథనం మేరకు వివరాలు ఇలా.. జమ్మలమడు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన డక్కా వెంకట భార్గవి (30) ఆమె భర్త వెంకటసుబ్బయ్య, డక్కా వెంకటేశ్, డక్కా వెంకట సుజాత, డక్కా వెంకట సుబ్బమ్మ, సుగుణ, వెంకట్ మరి కొంత మందితో కలసి గండి క్షేత్రానికి ఆటోలో బయలుదేరారు. ప్రొద్దుటూరు బైపాస్ సమీపంలో లారీని ఓవర్ టేక్ చేయబోతుండగా డ్రైవర్ వెంకటయ్య అదుపు చేయలేక ఆటో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో వెంకట భార్గవి (30) అక్కడికక్కడే మృతి చెందగా మరో 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఎస్ఐ కల్పన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ముగ్గురు సంతానం ఉన్నారు. కాగా ప్రమాదానికి గురైన వారిలో ముగ్గురు అన్నదమ్ములు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైదుకూరు : మండలంలోని మిట్టమానుపల్లె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలకృష్ణ (25) అనే యువకుడు మృతి చెందాడు. ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన బాలకృష్ణ మరో యువకుడు మోటార్ బైక్‌పై వస్తుండగా మైదుకూరు డిపోకు చెందిన బ్రహ్మంగారిమఠం సర్వీసు బస్సు ఎదురుగా వెళుతోంది. మిట్టమానుపల్లె వద్ద బస్సును తప్పించే ప్రయత్నంలో బైక్‌పై నుంచి ఇరువురు కింద పడినట్టు తెలుస్తోంది. ప్రమాదంలో బాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

వెలుగు దివ్వెలు..!


గ్రీటింగ్స్ తయారు చేస్తున్న ప్రత్యేక ప్రతిభావంతులు

- నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం
- గ్రీటింగ్స్, డిజైన్స్, అగర్‌బత్తీల తయారీలో ప్రత్యేక ప్రతిభావంతులు

మదనపల్లె సిటీ : వైకల్యం శరీరానికే తప్ప మనస్సుకు కాదని ఆ చిన్నారులు నిరూపిస్తున్నారు. అద్భుతమైన వస్తువులు, సువాసనలు వెదజల్లే అగర్‌బత్తీలు, మనస్సుకు హత్తుకునే గ్రీటింగ్స్ కార్డులు తయారు చేయడంలో వారికి సాటి ఎవరూ లేరని నిరూపిస్తున్నారు. తాము సాధారణ వ్యక్తులకు ఏ మాత్రం తీసిపోమని అంటున్నారు మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు. 1997లో కేవలం 14 మందితో ప్రారంభమైన వెలుగు పాఠశాల ప్రస్తుతం 190 మంది ప్రత్యేక ప్రతిభావంతులకు ఆశ్రయం కల్పిస్తోంది. వీరిలో సుమారు 60 మందికిపైగా వృత్తి విద్యలో రాణిస్తూ అందరి చేత మన్నలు పొందుతున్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం..

వెలుగు ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలలో గత 16 సంవత్సరాలుగా పిల్లలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం 28 మంది బోధన సిబ్బంది, 15 మంది పర్యవేక్షకులతో పాటు ఏడుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులు నిత్యం పిల్లల్ని పర్యవేక్షిస్తుంటారు. ఆ పాఠశాలలో 30 మంది విద్యార్థులు కంప్యూటర్ విద్యను నేర్చుకుని సొంతంగా వీడియోలు చేస్తున్నారు. చాక్‌పీసులు, కొవ్వొత్తులతో పాటు అగర్‌బత్తీలు తయారు చేస్తున్నారు. విద్యార్థులు తయారు చేసిన గ్రీటింగ్ కార్డులను బెంగళూరు రిషి వ్యాలీ, సత్‌సంగ్ ఫౌండేషన్ వారితో పాటు వెలుగు ఆశ్రమానికి వచ్చే వారు తీసుకెళ్తున్నారు. ప్రత్యేక ప్రతిభావంతులు తయారు చేసినన ప్లాస్టిక్ పుష్పాలు, బ్యాగుల తయారీ అందరిని ఆకట్టుకుంటోంది. మరికొంత మందికి కుట్టుమిషన్‌పై శిక్షణ ఇస్తున్నారు. వీరు చిన్న బ్యాగులు, కర్టెన్లు, పిల్లో కవర్లతో పాటు దుస్తులు కుట్టడం నేర్చు కుంటున్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలన్న లక్ష్యంతో ప్రత్యేక శిక్షకుడితో శిక్షణ ఇప్పిస్తున్నారు.

సౌకర్యాలు కల్పిస్తే మరింత మందికి ఆశ్రయం



వెలుగు పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తే మరింత మందికి ఆశ్రయం కల్పిస్తాం. విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నాం. సొంతంగా వీడియోలు తయారు చేస్తున్నారు. అగర్‌బత్తీలు తయారు చేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొంది బయటకు వెళ్లినవారు చాలా మంది విభిన్న వృత్తుల్లో స్థిరపడ్డారు.

- ఉదయమోహన్‌రెడ్డి, వెలుగు ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహకుడు

విపత్తుల నివారణకు మాక్ డ్రిల్


మాక్‌డ్రిల్‌లో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో సోమవారం విపత్తుల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ-1లో పెట్రోల్ ట్యాంక్ 301 వద్ద అలారం మోగింది. అంతలోనే మంటలు చెలరేగాయి. సిబ్బంది ఫైర్ అని గట్టిగా కేకలు వేయడంతో సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు పోప్ మానిటర్, ఫైర్ ఎస్టింగ్‌తో ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అక్కడ దగ్గరలో ఉన్న ట్యాంకర్లపైకి కూడా మంటలు ఎక్కడ వ్యాపిస్తాయోనని ముందు జాగ్రతగా ట్యాంకర్లను స్ప్రింకర్‌లతో కూల్ చేశారు. ఎట్టకేలకు మంటలను అదుపు చేశారు. అలాగే ఇద్దరు కార్మికులకు ప్రమాదం జరగడంతో వారిని స్ట్రెచర్‌పై మెడికల్ క్యాంపు వద్దకు తీసుకొచ్చే సన్నివేశాలను మాక్ డ్రిల్ చేసి చూపించారు. మాక్ డ్రిల్ చక్కగా చేశారని కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ క్రిష్ణమూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన సిబ్బందితో భద్రత, ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ సతీష్‌కుమార్, వీడీపీఎల్ డీజీఎం ఓబయ్య, కడప ఫైర్ ఎస్ఐ అన్వర్‌బాషా, కడప ఐఓసీ అధికారి దిలీప్, హెచ్‌పీసీఎల్ సేఫ్టీ అధికారి ప్రశాంత్ కుమార్, మేనేజర్ ఆపరేషన్ అధికారి ప్రీతీష్ కుమార్, ఆపరేషన్ అధికారి సౌరవ్ శుక్లా, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్, వైద్యులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ రాహుల్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ సిద్దారెడ్డి, హెచ్‌పీసీఎల్ సిబ్బంది, వీడీపీఎల్ పైప్‌లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో రౌడీషీటర్ దారుణ హత్య

- లాడ్జీలో మద్యం సీసాలతో కొట్టి చంపిన దుండగులు
- పరారీలో ప్రధాన అనుమానితులు సునీల్, లోకేశ్వరరెడ్డి
- పోలీసుల అదుపులో టీడీపీ నేత వీఎస్ ముక్తియార్ సోదరుడు ముజీబ్


ఘటనా స్థలంలో రాఘవేంద్ర అలియాస్ పప్పీ మృతదేహం


రాఘవేంద్ర అలియాస్ పప్పీ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఓ లాడ్జీలో జరిగిన హత్య కలకలం రేపింది. రౌడీషీటర్ కొప్పుల రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పీ (30)ని మద్యం సీసాలతో తలపై కొట్టి దారుణంగా హత్య చేశారు. లాడ్జీలోని గదిలో రక్తపు మడుగులో పడి ఉండగా రూం బాయ్ గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. సాయికుటీర్ రోడ్డుకు చెందిన లోకేశ్వరరెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతను శనివారం బీజీఆర్ లాడ్జీలో గది తీసుకున్నాడు. ఆ రోజు నుంచి పలువురితో కలిసి లాడ్జీలో మద్యం సేవించాడు. అతనికి సంజీవనగర్‌కు చెందిన పప్పీతో పరిచయం ఉంది. ఈ క్రమంలో రాఘవేంద్రతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్‌ముక్తియార్ సోదరుడు ముజీబ్, రెడ్డివారివీధికి చెందిన సునీల్ ఆదివారం రాత్రి లాడ్జీకి వెళ్లారు. అక్కడ అందరూ కలిసి మద్యం తాగారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30 సమయంలో వారి మధ్య గొడవ జరుగుతుండటంతో ముజీబ్ లాడ్జీలో నుంచి బయటికి వెళ్లాడు. వెళ్లేటప్పుడు రూంలో గొడవ జరుగుతోందని రిసెప్షన్‌లో చెప్పాడు. మద్యం మత్తులో గొడవ పడటం సహజమేనని భావించి రిసెప్షన్‌లోని లాడ్జీ సిబ్బంది అతని మాటలను పట్టించుకోలేదు. ముజీబ్ వెళ్లిన తర్వాత సోమవారం వేకువ జామున 1.30 సమయంలో లోకేశ్వరరెడ్డి, సునీల్‌లు లాడ్జీలో నుంచి బయటికి వెళ్లిపోయారు. ఇదంతా లాడ్జీలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. సోమవారం ఉదయం గదిని శుభ్రం చేసేందుకు రూం బాయ్ వెంకటేష్ వెళ్లగా అప్పటికే పప్పీ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. లాడ్జీ సిబ్బంది సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మద్యం సీసాలతో కొట్టడం వల్ల అతను మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.

రాఘవేంద్ర అలియాస్ పప్పీపై అనేక కేసులు

పప్పీపై ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. టూ టౌన్, త్రీ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు అతనిపై నమోదయ్యాయి. 2013లో అతను పప్పీ గ్యాంగ్ పేరుతో పట్టణంలో హడలెత్తించాడు. పట్టణంలోని అనేక మంది యువకులను ప్రోగు చేసుకొని చిన్నాచితక దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడేవాడు. అతని ఆగడాలు శృతి మించడంతో పోలీసు ఉన్నతాధికారులు 2014లో అతన్ని పట్టణ బహిష్కరణ చేశారు. దీంతో అప్పటి నుంచి పప్పీ హైదరాబాద్, బెంగళూరులో ఉంటూ వచ్చాడు. తర్వాత కువైట్‌కు వెళ్లి వచ్చినట్లు సన్నిహితులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం రాఘవేంద్ర ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఏడాది క్రితం సొంత బంధువులను బెదిరించగా వారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక యువకుడిని ఫోన్‌లో బెదిరించగా అతను టూ టౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు పప్పీని పిలిపించి మందలించారు.

పోలీసుల విచారణ..

పప్పీని హత్య చేసిన వ్యక్తులెవరనేది పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినప్పటికీ.. హత్యకు గల కారణాలు మాత్రం అంతుచిక్కడం లేదు. డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. ఘటనా స్థలంలో క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. మద్యం మత్తులో జరిగిన హత్యనా లేక పాతగొడవలే కారణమా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. పప్పీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. లాడ్జీ మేనేజర్ చంద్రఓబుళరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

వివాహమై ఆరు నెలలైనా కాలేదు..

ఆరు నెలల క్రితం పప్పీ సంజీవనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అనూషను రెండో పెళ్లి చేసుకున్నాడు. లాడ్జీలో భర్త మృతదేహాన్ని చూసి అనూష విలపించసాగింది. పెళ్లై కనీసం ఆరు నెలలైనా కాకముందే భర్త దుర్మరణం చెందాడని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కుమారుడు మృతి చెందాడనే సమాచారం తెలియడంతో బంధువులతో కలిసి తల్లి సరస్వతి ఘటనా స్థలానికి చేరుకుంది. మృతదేహాన్ని చూసి ఆమె కన్నీరుమున్నీరైంది.

పరారీలో నిందితులు..


ప్రధాన అనుమానితుడు లోకేశ్వరరెడ్డి (ఫైల్)

కొంత సేపటి వరకు మృతుడు ఎవరన్నది పోలీసులకు తెలియలేదు. ఆ తర్వాత హత్యకు గురైన వ్యక్తి పప్పీ అని పలువురు చెప్పడంతో అతని భార్య, తల్లిని పిలిపించి మృతదేహాన్ని చూపించారు. వారు చెప్పిన తర్వాత అతన్ని రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పీగా నిర్ధారించారు. రిసెప్షన్‌లోని రిజిష్టర్‌ను పరిశీలించిన పోలీసులు లోకేశ్వరరెడ్డి పేరుతో రూం బుక్ అయినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే లాడ్జీలోని వారి గదికి ఎవరెవరు వచ్చారనే విషయాలు సీసీ పుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. వారిలో లోకేశ్వరరెడ్డి, సునీల్ సెల్ నంబర్లకు ఫోన్ చేయగా ఫోన్లు పని చేయలేదు. వారిద్దరు పరారీలో ఉండటంతో పోలీసుల అనుమానం మరింత బలపడింది. లోకేశ్వరరెడ్డి, సునీల్‌లు పప్పీని హత్య చేసి ఉంటారని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. వారితో కలిసి ఉన్న మరో వ్యక్తి ముజీబ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.